క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


వెంకటరమణ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

నాగలాపురం: శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే నిత్యాన్నదానానికి ముంబైకి చెందిన వెంకటరమణ, మృదుల కిరణ్ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. దేవస్థానంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసి అన్నదానం ట్రస్టుకు విరాళం ఇచ్చిన వెంకటరమణ, మృదులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పళ్లికొండేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ అర్చకులతో వేద మంత్రాల నడుమ ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని ఆమందూరులో భూతగాదా ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆమందూరు గ్రామానికి చెందిన లోకనాథం, ఆయన కుమార్తె రమణిపై భూతగాదాలో అదే గ్రామానికి చెందిన ఉషారాణి, మురళి, వరదరాజులు, రాధయ్య, మునిరాజమ్మ, ఆదిలక్ష్మమ్మ దాడి చేసి గాయపరిచారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

హాస్టళ్లలో మలాథిన్ స్ప్రే


బీసీ బాలికల హాస్టల్ వద్ద మలాథిన్ స్ప్రే చేస్తున్న వైద్యసిబ్బంది

సత్యవేడు: ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులు, వర్షాలకు విద్యార్థులు ఉంటున్న వసతిగృహాల్లో దోమలు నివారణకు మలాథిన్ స్ప్రే చేస్తున్నట్లు దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం సత్యవేడులోని బీసీ బాలికల హాస్టల్, దళవాయి అగ్రహారంలోని బాలుర వసతి గృహం, ఎస్టీ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, బాలికల కాలేజీ హాస్టల్‌లో మలాథిన్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


వీధిలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న అధికారులు

నారాయణవనం: పారిశుద్ధ్య లోపంతో ప్రబలుతున్న విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. సోమవారం మండలంలోని పాలమంగళం దక్షిణపు కండ్రిగలో జిల్లా మలేరియా అధికారి రుపకుమార్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్‌తో పాటు వైద్యసిబ్బంది పర్యటించారు. వీధుల్లో నిలిచిపోయిన వర్షపునీటిని, వ్యర్థాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. నీటి నిల్వలపై అబేట్ మందును పిచికారీ చేయించారు. గ్రామంలోని 180 ఇళ్లలో లార్వా, ఫీవర్ సర్వే చేయించి, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో వరుసగా మూడు రోజుల పాటు లార్వా సర్వేను నిర్వహించాలని క్షేత్రస్థాయి వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమలత, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్యవేడు: విజయవాడలో ఈ నెల 8, 30వ తేదీల్లో జరిగే మాదిగ, రెల్లి, డక్కలి ఉపకులాల యుద్ధభేరి మహాసభలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య మాదిగ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్లయ్య, పొందయ్య, పెంచిలి, మాతయ్య, వెంకటేశ్, రవి, నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్ర.. ఓ చరిత

- పాదయాత్రకు ఆరు వసంతాలు
- ఈ యాత్రలోనే నవరత్నాల రూపకల్పన
- దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సచివాలయ వ్యవస్థకు సైతం శ్రీకారం
- సత్యవేడులో అంబరాన్నంటిన సంబరాలు


పిచ్చాటూరు: వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సత్యవేడు: కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు, అవినీతి పరుల పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో నడిపించాలన్న ఆకాంక్షతో నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర సోమవారం నాటికి ఆరు వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే దేశవ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు అందుకున్న ప్రజాసంకల్ప యాత్రలోనే సీఎం జగనన్న నవరత్నాల పథకాలకు శ్రీకారం చుట్టారని ఆనందం వ్యక్తం చేశారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో దారి తప్పిన వ్యవస్థను గాడిలో పెట్టేందుకు లోకల్ గవర్నెన్స్‌లో భాగంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారని కొనియాడారు. ఇప్పుడు దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ నిలుస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ కే.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2024లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ గెలుపు పతాకాన్ని ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి, జిల్లా మహిళా సభ్యురాలు మస్తానీ, వ్యవసాయ కమిటీ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలకేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి గజమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్‌లు కేజీ రోస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వైఎస్సార్ సీపీ కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి, పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, సురుటుపల్లి దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబరు అజయ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టరు కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు కారణి హరిబాబు, ఉప సర్పంచ్ మునిరాజా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో ..

నాగలాపురం: మండలంలోని టవర్ క్లాక్ కూడలి వద్ద ఉదయం 10 గంటలకు మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రైతుసంఘ అధ్యక్షుడు చిన్నదొరై, జెడ్పీటీసీ సుమతి, వైస్ సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: నారాయణవనం బైపాస్‌లోని వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, అన్నాదొరై, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


సత్యవేడు: సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


పిచ్చాటూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు,


బుచ్చినాయుడుకండ్రిగలో పాదయాత్ర చేస్తున్న నాయకులు


బుచ్చినాయుడుకండ్రిగలో కేక్ కట్ చేస్తున్న నేతలు


నారాయణవనంలో..


వరదయ్యపాళెంలో ..

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సంక్షేమ ప్రదాత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని ఇమామ్ వీధి, మారాతీపాళెం, జండా వీధి, జానుల్ల వీధి, కుమారస్వామి తిప్ప ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య, పలుచోట్ల ప్యాచ్ వర్క్‌ల్లో పెండింగ్ ఉండడంపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే అందేలా చూడాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రావు పవార్, ముత్యాల పార్థసారథి, సిరాజ్‌బాషా, ఫజల్, యతిరాజులు, మునిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జుంలేషా, షాకీర్, జిమ్ కరీముల్లా, జమీర్, బాబులాల్, షాహి, ఇస్మాయిల్, లాల్‌బాషా, కలాం, అహ్మద్, ఇబ్రహీం, అమీన్, ఖాదర్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- అట్టహాసంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు


జెర్సీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయిలో జరిగే అండర్-14, 17 రగ్బీ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్లు ఎంపిక కోసం పోటీలు జరిగాయి. స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి 340 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా, జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అండర్-17లో బాలికలు 12 మంది, బాలుర 12 మంది, అదేవిధంగా అండర్-14లో బాలికలు 12 మంది, బాలురు 12 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సంధ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురునాథం, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, పీఈటీలు కిషోర్‌కుమార్, మస్తాన్, హరి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా జెర్సీ పంపిణీ

రగ్బీ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వరదయ్యపాళెంకు చెందిన ఎన్‌ఆర్‌ఐ నందకిషోర్‌రెడ్డి రూ.35 వేలు విలువ చేసే జెర్సీలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న యోగా ప్రదర్శన..

శ్రీకాళహస్తి చెందిన పదవ తరగతి విద్యార్థిని శివాని యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థిని శివానీని ఎమ్మెల్యే ఆదిమూలం ఘనంగా సన్మానించారు.

చేసిన అభివృద్ధిని చెప్పుకుంటే చాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'మనం చేసిన అభివృద్ధి, జగనన్న అమలుచేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు, నియోజకవర్గ స్థాయిలో చేస్తున్న కార్యక్రమాల గురించి చెప్పుకుంటే చాలు' అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి సోషల్‌మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అనేక ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలను చేతిలో పెట్టుకుని నందిని కూడా పందిని అని నమ్మించడంలో ఆరితేరిందని దుయ్యబట్టారు. ఆ పచ్చ మీడియాకు దీటుగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా పనిచేయాలని పిలుపునిచ్చారు. మనం చేసిన అభివృద్ధిని, టీడీపీ నాయకులు చేసిన అరాచకాలను ప్రజలకు సవివరంగా తెలియజేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో పచ్చమీడియాతో ప్రజలకు అన్నీ తప్పుడు కథనాలను ప్రచారం చేసి ప్రజలను మోసం చేసేందుకు ప్రయతిస్తుందని విమర్శించారు. వాటికీ దీటుగా సమాధానం చెప్పేలా మనం ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గ, మండల కన్వీనర్లు, కోకన్వీనర్లు, నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడి ఉన్నం వాసునాయుడు, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, తిరుపతి జిల్లా సోషల్‌మీడియా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, జిల్లా కోకన్వీనర్ మైలం శ్రీకాంత్ రెడ్డి, వేలూరు రాకేష్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన సోషల్ మీడియా కార్యకర్తలు

నేడు బండారుపల్లిలో మెగా పశువైద్య శిబిరం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లిలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పశువైద్యాధికారి శిల్పారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లాకు బండారుపల్లి తొలి దశలో ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలతో శ్రీచైతన్య విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ధర్మరాజుల ఆలయం సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచ్ 3కు చెందిన విద్యార్థులు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఒలింపియాడ్ నాలెడ్జ్ అసైన్‌మెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపారు. పరీక్షల్లో 115 మంది పాల్గొనగా 72 మంది లెవల్-2కు ఎంపికయ్యారు. వారికి తొట్టంబేడు ఎంఈవో- 2 భాస్కర్ సోమవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి తెలిపారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కొంతమంది గ్రామ సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, వారిపై అధికారుల పర్యవేక్షణ అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహారావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండలంలో 943 జగనన్న ఇళ్ల నిర్మాణంలో ఉండగా 441 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి, సీడీపీఓ దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి సంక్షేమ పథకాల బోర్డుల ప్రదర్శన

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని 10 సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల బోర్డుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే అందజేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 9న బసవయ్యపాళెం, 10న కంచనపల్లి, 14న చిట్టత్తూరు, 15న చియ్యవరం, 16న గుండేలుగుంట, 17న శివనాథపాళెం, 20న కాసారం, 21న ఇలగనూరు, 22న పెద్దకన్నలి, 23న పెద్ద కనపర్తి సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

సేంద్రియ కూరగాయల సాగుపై శిక్షణ


రైతుకు వర్మీబెడ్ అందజేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేయడం ద్వారా సమాజానికి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో సోమవారం ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా రైతులకు సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పశువుల పేడ, వర్మీకంపోస్ట్ ఎరువులను కూరగాయల సాగులో వాడాలన్నారు. తద్వారా విషరహితమైన దిగుబడులు వస్తాయని, భూసారం కూడా పెరుగుతుందన్నారు. వ్యవసాయ సాగులోనూ రైతులు సేంద్రియ విధానాలను అవలంబించాలని కోరారు. వర్మీబెడ్స్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం మునగనారు, ఇంటి వద్ద వర్మీకంపోస్ట్ తయారుచేసేందుకు మొబైల్ వర్మీబెడ్స్‌ను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, అగ్రానామీ శాస్త్రవేత్త దివ్య, ఏర్పేడు మండల మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి డివిజన్‌లోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. శ్రీకాళహస్తి, రేణిగుంట, పిచ్చాటూరు మండలాల నుంచి 42 మంది అభ్యర్థులు హాజరైనట్లు సీడీపీవో శాంతిదుర్గ పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, సభ్యులు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ జయలక్ష్మి, డాక్టర్ చంద్రమోహన్, సీడీపీవోలు శాంతిదుర్గ, శోభారాణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్లమ్మ పొంగళ్లకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న శివయ్య, గ్రామస్తులు

ఏర్పేడు: స్థానిక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పొంగళ్లు పెట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. వారు సోమవారం సర్పంచ్ నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పొంగళ్లకు ఆహ్వానించారు. అలాగే వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డిని ఆహ్వానం అందించారు. పిల్లపాలెం వాసుదేవులు, కందాటి గోపి, గాలి గురవయ్య, దట్టం బాలాజీ, వెంకటేష్ పాల్గొన్నారు.

స్పందనలో ఆర్డీవోకు ఐదు వినతులు


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు వినతులు అందినట్లు ఆర్డీవో రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇందులో ఏర్పేడు మండలం నుంచి రెండు, శ్రీకాళహస్తి మండలం నుంచి మూడు రెవెన్యూకి సంబంధించి వినతులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిశీలించాల్సిందిగా ఆదేశించినట్లు చెప్పారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థిని


నిత్యాహాసినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రూపాదేవి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని నిత్యహాసిని షార్ట్‌పుట్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో నిత్యహాసిని ప్రతిభ చూపిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన పీఈటీ మేఘనను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జిలు కల్పన, జానకి, మేఘన, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ

శ్రీకాళహస్తి పట్టణంలోని ధర్మరాజుల ఆలయం సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచ్ 3కు చెందిన విద్యార్థులు 2023-24 సంవత్సరానికి సంబంధిని నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్టుకు ఎంపికయ్యారు వారికి సోమవారం తొట్టంబేడు ఎంఈవో భాస్కర్ నాసా కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ పాల్గొన్నారు.